

డిస్ట్రిక్ట్ లెవెల్ అథారిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



ఎన్నికలు ఎప్పుడో?



ఈనెల 31తో ముగియనున్న సర్పంచుల గడువు

జీపీల వివరాలు

వరంగల్ జిల్లాలో 11 మండలాలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 323 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలాల వారీగా గ్రామ పంచాయతీల వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారావుపేట పరిధిలో 30, దుగ్గొండి 34, గీసుగొండ 21, ఖానాపూర్ 20, నల్లబెల్లి 29, నర్సంపేట 27, నెక్కొండ 39, పర్వతగిరి 33, రాయపర్తి 39, సంగెం 33, వర్ధన్నపేట 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

- పంచాయతీ ఎన్నికలపై స్పష్టతనివ్వని సర్కారు
- ఎంపీ ఎన్నికల తర్వాతే నిర్వహిస్తారా..
- ఎంపీటీసీ, జడ్పీటీసీలతో కలిపి నిర్వహించే చాన్స్
- ప్రత్యేక అధికారుల పాలన సాగేనా?
- రిజర్వేషన్ల కొనసాగింపుపై ఉత్కంఠ

వర్ధన్నపేట, జనవరి 11: గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ఈనెల 31వ తేదీతో ముగియనుంది. ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటనే దానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. అయినా ఆశావహులు ఇప్పటి నుంచే పోటీ చేసేందుకు తమ వర్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో ఉన్న రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరుగుతాయా లేక కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఏమైనా మారుస్తుందా అన్న సందిగ్ధం నెలకొంది. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన కసరత్తును ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించినా రిజర్వేషన్ల కేటాయింపుపై ఇంకా స్పష్టతనివ్వలేదు. మరోవైపు రిజర్వేషన్లు తమకు అనుకూలంగానే ఉంటాయనే ఉద్దేశంతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఇప్పటి నుంచే నిమగ్నమయ్యారు.

వివరాల సేకరణ

పంచాయతీ పాలకవర్గాలకు ప్రభుత్వం 2019లో ఎన్నికలు నిర్వహించింది. పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన పంచాయతీలకు కేటాయించిన రిజర్వేషన్లు పది సంవత్సరాలపాటు కొనసాగించేలా తీర్మానిస్తూ చట్టాన్ని రూపొందించారు. ఈ మేరకు మార్చి 2018న ప్రభుత్వం దీనిపై ఉత్తర్వులు సైతం జారీ చేసింది. సవరించిన పంచాయతీ రాజ్ యాక్ట్ రిజర్వేషన్ల ప్రకారం పంచాయతీ ఎన్నికలను 2019 జనవరిలో మూడు విడుతలుగా నిర్వహించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఫిబ్రవరి 2న ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 31వ తేదీతో వారి పదవీకాలం ముగియనుంది. దీంతో ఎన్నికల నిర్వహణ అవశ్యంగా మారింది. ఆ దిశగానే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొంటూ గత నెల 5న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు పోలింగ్ సిబ్బంది వివరాలు సేకరించి సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

ఎన్నికలు నిర్వహించేనా

ఈనెల 31తో సర్పంచుల పదవీకాలం ముగియనుండగా ఆలోపు ఎన్నికల నిర్వహణ సాధ్యమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో క్షేత్రస్థాయిలోనూ కసరత్తు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఆదేశాలు జారీ చేసినా నిర్దీత గడువులోగా ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. సమీపంలోనే పార్లమెంట్ ఎన్నికల ఉండడంతో అది పూర్తయ్యాకే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యేక అధికారుల పాలన

ఒకవేళ పార్లమెంట్ ఎన్నికల తర్వాతే జీపీలకు ఎన్నికలు జరిగితే, జీపీలలో ప్రత్యేక అధికారుల పాలన వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇది ఎంపీ ఎన్నికల వరకు కొనసాగే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం వచ్చే ఏడాదిలో ముగియనుంది. వీటికి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో పంచాయతీ ఎన్నికలతో కలిపే వాటిని నిర్వహిస్తారనే చర్చ కూడా సాగుతోంది. కొత్త ప్రభుత్వం సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీలతోపాటు జడ్పీ చైర్మన్ పదవుల రిజర్వేషన్లు సైతం మారుస్తుందనే ఊహాగానాల నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు ముమ్మరంగా ప్రారంభించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 11: జిల్లాలో ఆస్పత్రుల యాజమాన్యం లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఎంతటివారైనా ఉపేక్షించమని కలెక్టర్ పి.ప్రావీణ్య హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా లెవెల్ మల్టీమెంబర్ అథారిటీ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే ఆస్పత్రి సీజ్ చేయడంతోపాటు వారి డిగ్రీ సర్టిఫికెట్లను రద్దుకు సిఫారస్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రాణాల్ని నిలబెట్టే డాక్టర్లు ప్రాణాన్ని తీయడం దురదృష్టకరమన్నారు. ఎవరైనా అక్రమ మార్గంలో స్కానింగ్‌లు నిర్వహిస్తున్నారని, అబార్షన్లకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడ పిల్లల నిష్పత్తి రోజురోజుకు తగ్గుతున్న దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ వహించి ఆడ పిల్లల నిష్పత్తి పెరిగేందుకు గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. రెండో అడిషనల్ సెషన్స్ జడ్జి సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆస్పత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించి అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడితే వారిపై చట్ట రీత్యా చర్యలు ఉంటాయన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రతీ స్కానింగ్ సెంటర్‌ను పర్యవేక్షించి లింగనిర్ధారణకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలో 2022-23 రబీ పంట, 2022-2023 ఖరీఫ్ పంట సీఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పౌరసరాల శాఖ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ, సివిల్ సప్లై, డిప్యూటీ తహసీల్దార్, రైస్‌మిల్లర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2022-23 వానాకాలంలో 1,79,925 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 1,07,673 మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ డెలివరీ పూర్తయిందని, రా రైస్, బాయిల్డ్ రైస్ లక్ష్యాలకు అనుగుణంగా పూర్తికి రైస్ మిల్లర్లు సహకరించాలని బాయిల్డ్ రైస్ టార్గెట్ తక్కువగా ఉందని దానిపై దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. వేసవి సీజన్‌లో 1,53,904 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఇప్పటి వరకు సీఎంఆర్ డెలివరీ 24,221 మెట్రిక్ టన్నులు జరిగిందన్నారు. మిల్లర్లు గడువు లోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారి సంధ్యారాణి, అసిస్టెంట్ అధికారి సయ్యద్ ఫైసల్ హుస్సేన్, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాశ్‌వర్మ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ గోనెల రవీందర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల జాబితాను సిద్ధం చేయండి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 11: పట్టభద్రుల ఎన్నికల జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈఆర్‌వోలతో కలిసి పట్టభద్రుల ఎన్నికల జాబితాపై ఎలక్ట్రోల్ తయారీపై ఏఈఆర్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో సంబంధిత అధికారులు ఎలక్ట్రోల్ తయారు చేయడంలో అంకిత భావంతో పనిచేయాలన్నారు. పట్టభద్రులు ఫాం 18 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతీ మండలానికి డిసిగ్నేటెడ్ అధికారులను నియమించడం జరిగిందని, ఫైనల్ ఓటర్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఏప్రిల్ 4న విడుదల చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో వాసుచంద్ర, నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, పట్టాభి శ్రీనివాస్, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.



వ్యవసాయ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అగ్రి వర్సిటీ భూములను హైకోర్టు కోసం ఇవ్వొద్దు

- జీవో నెం. 55ను వెనక్కి తీసుకోవాలి...
- వరంగల్‌లో అగ్రి వర్సిటీ విద్యార్థుల నిరసన...

వరంగల్ సిటీ, జనవరి 11: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన వంద ఎకరాల భూమిని హైకోర్టు నిర్మాణానికి ఇవ్వొద్దని వరంగల్ ములుగురోడ్‌లోని యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనలకు పిలుపునకు మద్దతుగా గురువారం విద్యార్థులు తరగతులు బహిష్కరించి కళాశాల ముందు నినాదాలతో కూడిన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... ప్రభుత్వం హైకోర్టుకు కేటాయించిన 100 ఎకరాల్లో 60 ఎకరాల విస్తీర్ణంలో జీవవైవిధ్య పార్కు ఉందని, దాంట్లో 260 జాతుల మొక్కలు, వృక్షాలు, 80 ఔషధ జాతి మొక్కలు, వృక్షజాతులున్నాయన్నారు. హైకోర్టుకు ఈ భూములను కేటాయించడంతో ఇందులోని జీవవైవిధ్యం అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 30ఏళ్ల క్రితం అగ్రికల్చర్ యూనివర్సిటీ వారు తూర్పు కనుమలు, శేషాచలం, అరకు, మధ్యప్రదేశ్ లాంటి దట్టమైన అటవి ప్రాంతాల్లో నుంచి తీసుకువచ్చిన విత్తనాలతో అభివృద్ధి చేసిన జీవవైవిధ్య పార్కు కోసం చేసిన కృషి కనిపించకుండా పోతుందని ఆందోళన చెందారు. ప్రభుత్వం హైకోర్టు నిర్మాణం కోసం వంద ఎకరాలను ఇస్తున్నట్లు జారీ చేసిన జీవో నెం. 55ను రద్దు చేసి వర్సిటీ భూములను కాపాడాలన్నారు. అదే ప్రాంతంలో అనేక ప్రభుత్వ భూములున్నాయని వాటిల్లో నుంచి హైకోర్టు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్ల ధర్నా



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 11: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ బల్దియా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. గురువారం హనుమకొండలోని బల్దియా కార్యాలయం ఎదుట స్వచ్ఛభారత్ ఆటో డ్రైవర్స్ కమ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆటోడ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డ్రైవర్లు కోరారు. గతంలో కౌన్సిల్ సమావేశంలో ప్రతిగృహం నుంచి చెత్త సేకరణకు గాను రూ.60 తీసుకోవాలనే తీర్మానం జరిగినా ఫలితం లేదని వాపోయారు. నాలుగు నెలలుగా వేతనాలు లేవని వాపోయారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బల్దియా కార్మిక సంఘాల ప్రతినిధులు వేల్పుల ధర్మరాజు, సింగారపు బాబు, బొట్ల భిక్షపతి, మహేశ్, రాజారపు భాస్కర్, కిషోర్, రవీందర్, ప్రవీణ్, మురళీక్రిష్ణ డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను డ్రైవర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు కలవగా, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఏసీబీ వలలో జనగామ డీఎంహెచ్‌వో

- ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్ట్‌కు లంచం వేధింపులు
- రూ. 50 వేలు టేబుల్ డ్రాలో పెట్టిన బాధితురాలు
- పక్కా ప్లాన్‌తో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- సహకరించిన జూనియర్ అసిస్టెంట్ అరెస్టు
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఘటన



డీఎంహెచ్‌వో ప్రశాంత్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

జనగామ టౌన్, జనవరి 11: జనగామ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ చేపూరి ప్రశాంత్ గురువారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ ఫార్మసిస్ట్ వద్ద లంచం పుచ్చుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జనగామ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. డీఎంహెచ్‌వోతోపాటు జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు... జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన స్రవంతి అనే యువతి 2021 నుంచి ఓబుల్‌కేశ్వాపూర్ ప్రాథమిక వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఫార్మసిస్ట్‌గా పనిచేస్తోంది. పర్మనెంట్ ఉద్యోగి వచ్చారనే సాకు చూపించి ఆమెను 2023 అక్టోబర్‌లో తొలగించారు. అదే రోజు సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఆమెకు జూనియర్ అసిస్టెంట్ అజహర్ ఫోన్ చేశారు. తిరిగి ఉద్యోగం కావాలంటే డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలవాలని సూచించారు. ఆమె డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లగా, ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని చెప్పారు. తాను అంత ఇచ్చుకోలేనని డీఎంహెచ్‌వో ప్రశాంత్‌కు తెలిపింది. రూ.50వేల వరకు ఇస్తానని విన్నవించుకుంది. ఈ క్రమంలో వారం కిందట రూ.50 వేలు చెల్లించింది. అయినా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆమె డీఎంహెచ్‌వోను ప్రశ్నించింది. మరో రూ.50వేలు ఇవ్వాల్సిందేనని జూనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌వో చెప్పారు. ఈ క్రమంలో బాధితురాలు ఏసీబీ అధికారులను సంప్రదించింది. వారి డైరెక్షన్‌లో రూ.50వేల నగదు తీసుకుని గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లింది. డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ సూచన మేరకు ఆ డబ్బులను కార్యాలయంలోని ఓ టేబుల్‌లో పెట్టింది. ఈ క్రమంలో అక్కడే మాటువేసి వున్న ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి వెళ్లి డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. లంచం డిమాండ్ చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, కె.శ్రీను, ఎన్.రవి పాల్గొన్నారు.

కేయూ పరీక్షల విభాగం ఉద్యోగులపై వేటు

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులపై వేటువేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి గురువారం తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ బీఏ, బీకామ్ విభాగంలో సెక్షన్ క్లర్క్‌లు పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు డబ్బులు ఇస్తేనే విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు పాస్ మెమోలు, ఇతర ధ్రువపత్రాలు ఇస్తున్నారని పలువురు ఫిర్యాదులు చేశారు. అవినీతి ఆరోపణలతోపాటు కళాశాల అధ్యాపకులపై దురుసుగా ప్రవర్తించడం, నేరుగా డబ్బులు అడగకుండా పైసలిస్తేనే పనులు చేస్తామనే ధోరణి ప్రదర్శించే వారని అధికారులు వెల్లడించారు. అలాగే సర్టిఫికెట్లు కళాశాలకు పంపామని, కళాశాల వారు వస్తే నేరుగా విద్యార్థులకే ఇస్తామనే కుంటిసాకులు చెబుతూ లంచాలు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇచ్చేవారని అధికారులు వెల్లడించారు. గతంలో పరీక్షల విభాగంలో పనిచేసే వారిపై అనేక ఆరోపణలున్నా రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘాల నేతల పలుకుబడితో అదే సెక్షన్‌లో కొనసాగారు. అయితే ఇటీవల కేయూ ఆడిట్ ఆఫీసర్ ఎస్.కిష్టయ్య లంచలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో వర్సిటీలో అవినీతి, లంచాలకు మరిగిన ఉద్యోగులపై వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు కఠిన నిర్ణయాలకు దిగారు. పరీక్షల విభాగంలో అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులను విధుల్లోకి రావొద్దని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి చెప్పారు. శనివారం తర్వాత వారికి మరో విభాగంలో విధులు కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే వారిపై విచారణ చేపట్టి శిక్షించాలని వర్సిటీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా, రెగ్యులర్‌గా ఉత్తీర్ణత సాధించే విద్యార్థులకు నేరుగా కళాశాలకు ధ్రువపత్రాలను పంపుతామని, రీవాల్యూవేషన్‌లో పాసయ్యే అభ్యర్థులకు నేరుగా పరీక్షల విభాగంలో పాస్ మెమోలను జారీ చేస్తామని పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు.

గ్యారెంటీలపై ఆశలు

మట్టెవాడ, జనవరి 11: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్ల నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. సమాచారమంతా ఆన్‌లైన్ నిక్షిప్తం చేశారు. వరంగల్ గ్రేటర్ పరిధిలో 2,86,820 దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయిన సమాచారం అందుకున్న ప్రజలు దరఖాస్తుల విచారణ ఎప్పుడు చేపడుతారని సర్కిల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి వాకబు చేస్తున్నారు. ఆరు గ్యారంటీలపై గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. లక్షల్లో దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో విచారణ పారదర్శకంగా చేయాల్సిన అవసరం ఉంది. నిజమైన పేదలకు, అర్హులకు సంక్షేమ పథకాలు అందేందుకు విచారణ పకడ్బందీగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి వికలాంగులు, వితంతులు, వృద్ధులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కావడంతో గ్రేటర్ అధికారులు విచారణ ప్రారంభించేందుకు కసరత్తుపై దృష్టి పెట్టారు.

వరంగల్ ఆర్టీవోగా పాండురంగారావు



పాండురంగారావు

సంగెం, జనవరి 11: వరంగల్ ఆర్టీవో (రీజినల్ ట్రాన్స్‌పోర్టు అధికారి)గా పెద్దపల్లిలో పనిచేస్తున్న పాండురంగారావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న అఫ్రీన్ సిద్దిఖీ పెద్దపల్లికి వెళ్లనున్నారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. పాండురంగారావు వరంగల్, అఫ్రీన్ సిద్దిఖీ పెద్దపెల్లి ఆర్టీవోలు పనిచేస్తుండగా, మూడేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై పాండురంగారావు పెద్దపల్లికి, అఫ్రీన్ సిద్దిఖీ వరంగల్‌కు వచ్చారు. తాజాగా ప్రభుత్వం యథాస్థానానికి పంపిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

వరంగల్ సంతృప్తినిచ్చింది: ఆఫ్రీన్ సిద్దిఖీ

వరంగల్‌లో పనిచేయడం తనకు చాలా సంతృప్తినిచ్చిందని వరంగల్ ఆర్టీవోగా పనిచేసి వెళ్తున్న అఫ్రీన్ సిద్దిఖీ చెప్పారు. గురువారం వరంగల్ రవాణాశాఖ కార్యాలయం (ఆర్టీవో)లో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఉద్యోగులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ రవాణా శాఖ కార్యాలయంలోని ఉద్యోగులు పూర్తి సహకారం అందించారని చెప్పారు. కార్యక్రమంలో రమేష్‌రాథోడ్, కోల రవీందర్, షాలినీ, స్వర్ణలత, కార్యాలయ సూపరింటెండెంట్ నరేందర్, సీనియర్ అసిస్టెంట్ హరిత, జూనియర్ అసిస్టెంట్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం

- కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించిన కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- వర్ధన్నపేట మునిసిపాలిటీలో ముసలం



ఆర్డీవో వాసుచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

వర్ధన్నపేట/ వరంగల్ కలెక్టరేట్, జనవరి 11: వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్మన్ అంగోతు అరుణ, వైస్ చైర్మన్ కోమండ్ల ఎలేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదిస్తున్నట్లు వర్ధన్నపేట మునిసిపాలిటీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు వినతిపత్రాన్ని అందించారు. గురువారం కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు చేరుకోగా కలెక్టర్ ప్రావీణ్య అందుబాటులో లేకపోవడంతో వరంగల్ ఆర్డీవో వాసుచంద్రకు అందజేశారు. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు, బీజేపీకి చెందిన ఒక కౌన్సిలర్, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సంతకాలు చేసి వినతి పత్రం సమర్పించారు. అయితే 12మంది కౌన్సిలర్లలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, మరో కౌన్సిలర్ మాత్రమే అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఉన్నారు. కాగా ఏడో వార్డు కౌన్సిలర్ పాలకుర్తి సుజాత ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లలో బానోతు అనిత(5వ వార్డు), కోదాటి పద్మ(8వ వార్డు) మంచాల రామకృష్ణ(9వ వార్డు) తుమ్మల రవీందర్(10వ వార్డు), పూజారి సుజాత(12 వార్డు), సమ్మెట సుధీర్(1వ వార్డు), కొండేటి అనిత(3వ వార్డు), భూక్యా సరిత(4వ వార్డు)ఉన్నారు.

గతంలోనూ అవిశ్వాసానికి యత్నం..

రెండేళ్ల క్రితం కౌన్సిలర్లు వర్ధన్నపేట అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగాయంటూ అవిశ్వాస తీర్మాన కాపీలను అందజేయాలని మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో అందజేసినట్టు కౌన్సిలర్లు పేర్కొన్నారు. అయినా కమిషనర్ పట్టించుకోలేదని ఆరోపించారు. మునిసిపాలిటీ ఆవిర్భావం నుంచి అవినీతి, అక్రమాలు జరిగాయని, పర్సన్ ఇన్‌చార్జి పాలనతోపాటు మునిసిపల్ కొత్త పాలక వర్గం ఏర్పడిన మూడేళ్లలో రూ. 6.5కోట్లకు పైగా నిధులను నాటి మునిసిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్, చైర్‌పర్సన్ అంగోతు అరుణ, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి కుమ్మక్కై, అభివృద్ధి పనుల పేరుమీద అవినీతి, అక్రమాలకు పాల్పడి దుర్వినియోగం చేశారని ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని నాటి ఎమ్మెల్యే అరూరి..

ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో మునుగోడు ఎన్నికల్లో అక్కడే తిష్టవేసిన ఎమ్మెల్యే అక్కడికే పిలిపించి మాట్లాడారని, ఎన్నికల అనంతరం మాట్లాడుతూ పనులకు సంబంధించిన తీర్మానాల కాపీలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని కౌన్సిలర్లు గుర్తుచేశారు. తర్వాత ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అధికంగా ఉండడంతో మిన్నకున్నట్టు వెల్లడించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతోపాటు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి అవినీతి వెలికి తీయాలనే ఆలోచనతో తొమ్మిది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన కాపీలపై సంతకాలు చేసి గురువారం కలెక్టరేట్‌లో సమర్పించడం చర్చనీయాంశమైంది. ఇటీవల ప్రజాపాలనలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు కొందరు కౌన్సిలర్లు రూ.6.5 కోట్ల అవినీతి జరిగిందని విచారణ చేపట్టాలని వినతిపత్రంలో కోరడం కొసమెరుపు.

ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం

● గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

● ఈ నెల 15వ తేదీ వరకు గడువు

హనుమకొండ రూరల్, జనవరి 11: ఎస్సీ గురుకులాలు పేద విద్యార్థులకు వరంగా మారాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ప్రతిభ కళాశాలలు (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) అసాధారణ ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తూ బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీ, నీట్‌లో ఈ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిసి మడికొండలో బాలురకు 1, బాలికలకు 1 కళాశాల ఉంది. ఇందులో బైపీసీ 40, ఎంపీసీ 40 సీట్లు చొప్పున ఉన్నాయి. విద్యార్థులకు నచ్చినరంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లో గురుకుల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

ఈ నెల 15వ తేదీ వరకు గడువు

ప్రస్తుత విద్యాసంవత్సరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల కోసం తమకు ఇష్టమైన కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధన ఉంటుంది. సీఈవో కళాశాలల్లో ఇంటర్మీడియేట్ తరగతులతోపాటు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, క్లాట్, సీఎంఏ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష బహుల ఐచ్ఛిక పద్ధతిలో తెలుగు, ఇంగ్లీషులో ఉంటుంది. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అందులో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిలో రెండో స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులను రెండో విడతలో ఫిబ్రవరి 25న ఎంపిక చేసిన సెంటర్లలోనే 150 మార్కులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఎస్సీలకు 75శాతం, బీసీలకు 12శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 3శాతం, ఇతరులకు మిగిలిన సీట్లు కేటాయించి ఆ మేరకు మెరిట్ జాబితాను ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రతిభ ఆధారంగానే ఎంపిక

ఎస్.విద్యారాణి, ప్రాంతీయ సమన్వయ అధికారి వరంగల్ రీజియన్



ప్రతిభా కళాశాలలు అద్భుత విజయాలు, అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలకు చిరునామాగా నిలుస్తున్నాయి. అట్టడుగువర్గాల్లోని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు గురుకులాలు బాటలు వేస్తున్నాయి. ఉచిత విద్యను అందించడంతోపాటు నిరుపేద విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా ఐఐటీ, నీట్‌లాంటి జాతీయ పోటీపరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తాం. గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తాం.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కమలాపూర్, జనవరి 11: మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల రమ(45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు గురువారం పోలీసు ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన రమతో మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల స్వామికి 25 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. స్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా, రమ వ్యవసాయ కూలి పనిచేసి జీవనం గడుపుతున్నారు.

కాగా, గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రమ కనిపించకుండా పోయింది సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, దుప్పటి గ్రామస్థులకు కనిపించాయి. దీంతో వారి కుటుంబ సభ్యులుకు తెలుపగా వెంటనే అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మహిళ మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారు. మృతురాలి సోదరుడు బొమిక సౌందరయ్య ఫిర్యాదు మేరకు రమది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కారు పల్టీ - తప్పిన ప్రమాదం

ఐనవోలు, జనవరి 11: కారు అదుపుతప్పి పంట పొలాల్లో పడి పోయిన సంఘటన పున్నేలు క్రాస్‌రోడ్డు జాతీయరహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం గోవర్ధనగిరికి చెందిన రషీద్ వరంగల్ నుంచి పంథిని వైపు కారులో వెళ్తున్నాడు. క్రాస్ రోడ్డు దాటాక కారు అతి వేగంగా కుడివైపు రోడ్డును దాటి ఆర్ అండ్‌బీ సూచికల బోర్డును ఢీకొట్టి 150 అడుగుల దూరంలో ఉన్న మొక్కజొన్న పంటచేనులో పడిపోయింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. కారు బెల్టు ధరించడం వలన స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కారు కుడివైపున దూసుకపోయిన సమయంలో మరే వాహనం ఎదురుగా రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.



కొత్తకొండలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీకాంత్

కొత్తకొండ జాతరకు ప్రతీరోజు 20 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు హుజూరాబాద్ నుంచి 80 ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80 ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.60, చిన్నారులకు రూ.30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణికులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి ఉప్పుల భద్రయ్య, సర్పంచ్ దూడల ప్రమీల-సంపత్, ఆర్టీసీ డ్రైవర్ దూడల ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో బట్టల పంపిణీ



బట్టలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ప్రతీ ఏడాది బోధనేతర ఉద్యోగులకు వర్సిటీ అందజేసే ఉచిత బట్టలను (డ్రెస్ కోడ్)ను గురువారం కేయూ పరీక్షల విభాగంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఉద్యోగులకు డ్రెస్‌లను అందచేస్తామని, విధుల్లో ఉన్నప్పుడు డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. డ్రెస్‌తో వర్క్ కల్చర్‌తో పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నరసింహరావు, ఎఫ్ఓ తోట రాజయ్య, కేయూ టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎ.నందయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ షకూర్, పోలేపాక కోర్నేల్, మల్లికాంబు, మజార్ అలీ, విజయ్,ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఐలోని మల్లన్న డోలు

జాతరకు ముస్తాబైన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

విభిన్న పద్ధతుల మిళితం.. జానపదుల జాతరగా ప్రాశస్త్యం

రాణి రుద్రమదేవి సైతం సంతానప్రాప్తికి పూజలు



'సకం భాగ్యాలు కలిగి... సంతోషమాత భక్తి కలిగి... అవులు గోవులు కలిగి... అవాలక్ష కావాల్లు కలిగి... ముట్టింది ముచ్చమై పట్టింది బంగారమెమ్మై.. పాలి వాడు దగ్గరై పగవాడు దూరమై.. ఏటికి ఎడ్లు కలిగి పాటికి బర్లు కలిగి... పర్వ తాల మల్లయ్యా.. మా పాలి కలిగి ఉండి... పతి పార్వతిలా కొరిమే" అంటూ ఒగ్గు పూజారులు ఢమురుకాల శబ్దాల నడుమ కొలువనుండగా మల్లన్న జాతర వైభవంగా జరగనుంది. ఈ జాతర జానపదుల జాతరగా ప్రాచుర్యం పొందింది. మకర సంక్రమణతో ప్రారంభమయ్యే జాతర ఉగాది వరకు సాగనుంది. కాకతీయుల కాలంలో మొదలైన ఈ క్రమం.. కాలాలు మారినా దినదినం ఇంకా వెలుగొందుతూనే ఉంది. మరో మూడు రోజుల్లో మొదలయ్యే ఈ జాతరలో భక్తులు ఆచరించే తంతుపై ప్రత్యేక కథనం..



ఐనవోలు, జనవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి(మల్లన్న) జాతర భక్తులకు ఎంతో ప్రాశస్త్యమైనది. పూర్వ కాలంలో జానపదుల జాతరగా కీర్తి గడించి, శైవారాధన పూజలు అందుకుంది. 1100 యేళ్ల కిందట కోరమీసాల మల్లన్న కొలువయ్యాడని భక్తుల విశ్వాసం. విభిన్న శైవాగామ పద్ధతుల్లో నిత్యపూజలు అందుకునే మల్లన్న స్వామి ఒక చేతిలో ఖడ్గం మరోచేతిలో త్రిశూలం ఢమురకం తలపై కిరీటం మూతిపై మీసం ఒక ప్రత్యేకతగా దర్శనమిస్తాడు. నిర్వికారి నిరహంకార నిరాకారస్థితి లింగస్వరూపంలో మూలవిరాట్ అర్ధప్రానపట్టం శ్వేత వర్ణము కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషంగా భావిస్తారు. ఖండోభ అవతారంలో స్వామి వారికి భార్యలు కుడిపక్క గొల్ల కేతమ్మ ఎడమ పక్కన బలిజ మెడమ్మలు కొలువయ్యారు. ప్రతీ రోజు శైవాగమ పద్ధతినను సరించి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ముఖ్య పూజల్లో భక్తులు బోనాలు, పట్నాలతో నైవేద్యం సమర్పిస్తారు.

చెలుక, నజరు పట్నం.. పెద్దపట్నం..

మొక్కులతో ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకొని మొక్కులు చెల్లించాకే స్వామి వారిని దర్శించుకుంటారు. బండారి పలుకపై తెల్లపిండి పసుపు కనుగోల్లు దోశెడు బియ్యం పోసి మైలపోలు తీస్తారు. కుడుక, పోక, ఖర్జూర, పసుపు గౌరవమ్మను పెట్టి రైక మలపు తెల్లతువ్వాల పెట్టి మైల పోలు తీశాక తంగడిపచ్చతో చల్లి తెల్లపిండిలో పలుక కోట్టి పట్నం(పటం) వేసి మల్లన్న కథలు చెప్పుతారు. శరణు మల్లేశా.. అంటూ పాటలోనే కల్యాణం చేసి పట్నం మీద అక్షింతలు వేస్తారు. ఒక్కపొద్దు విడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దపట్నం వేసి స్వామి కథను చెప్పుతారు. జానపదుల అవాహనాల్లో పట్నం అంటే ఆసనం రూపకంలో శివుడిని ఆహ్వానించడం అన్నమాట. స్వామివారికి ఉదయం మేలుకోలుపు, రాత్రి పవలింపు ఒగ్గు పూజారులే చేయం అనావాయితీగా వస్తోంది.

బోనం.. నైవేద్యం..

బోనం అన్నంలో పాలు, బెల్లంతో పరామాన్నం వండుతారు. కాకరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, గుమ్మడి కాయ అన్ని కలిపి వండి పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం బాల బోగం, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం ప్రదోశకాల బోగం సమర్పిస్తారు.

బండారి పసుపు.. గజ్జెల లాగు..

తెలుపు బొట్టు విభూది పెట్టుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మతో వరం పొందారు. ఆదే రాక్షసులను సంహరించేందుకు పసుపు (బండారి) బొట్టు, గజ్జెల లాగు తొడిగి జాలి ముసుగు వేసుకొని కొరడా, త్రిశూలం, ఢమురకంతో వచ్చి మల్లికార్జునస్వామి రాక్షసులను సంహరించడాని భక్తుల విశ్వాసం. భక్తులు పసుపును కిలోల కొద్ది తీసుక వచ్చి స్వామివారికి సమర్పించి వెంట కొంత తీసుకెళ్లారు. ఒగ్గు పూజారుల కథల్లో మల్లన్నకు - మంగోలియా దేశానికి పసుపు సంబంధం కనిపిస్తుంది.

శివసత్తులు.. శివసతులు..

జాతరలో ఎటు చూసినా శివసత్తుల పూనకాలే కనిపిస్తాయి. శివసతులే శివసత్తులుగా పిలువబడుతున్నారు. శివుడికి నాట్యం అంటే ఇష్టం మహిళలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం పూర్వ కాలం నుంచి వస్తోంది. అందులో భాగంగానే పునకాల నడుమ నృత్యాలు చేస్తారు. పురుషులు మహిళా వేషాధారణలో తన్మయం చెందుతారు.

కొడే కట్టుట.. టెంకాయ బంధనం

శివుడి వాహనం కొడే(నంది) కోరికలు తీరితే కోడెను కడతారు. పెళ్లి కాని వారు, సంతాన లేమి, తదితర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మొక్కుబడి టెంకాయ బంధనం చేస్తారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క ముడుపు కట్టుతారు. కోరికలు తీరాక ముడుపు విప్పి మొక్కుబడిని చెల్లిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న భక్తుల నమ్మకం సంప్రదాయం. ఒడి బియ్యం పసుపు, నూనెతో కలిపి పోకచెక్కలు, ఖర్జూర పండ్లు, ఇద్దరు అమ్మవార్లకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పెట్టుతారు. స్వామి వారికి దోతి, తువ్వాల సమర్పిస్తు ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకుంటారు. రాణి రుద్రమదేవి సైతం తన కూతురు ముమ్మడమ్మకు సంతానప్రాప్తి కోసం ఐదు రోజులు ఇక్కడే ఉండి మొక్కుకున్నట్లు చరిత్ర ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

గండ దీపం.. శేవాలు..

గండాలు తీరితే గండదీపం పెడతారు. తలపై దీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. పిల్ల, జెల్ల చల్లగా ఉంటే శేవాలు తీస్తామని మొక్కుకున్న వారు తలనీలాలు సమర్పిస్తారు. ఆలయంలో మల్లన్న స్వామి పుట్టమన్ను రూపంలోనే కొలువయ్యాడు. మల్లికార్జునస్వామిని ఇలవేల్పు దైవంగా భావించే యాదవులు, కుర్మలు, ఇలవేల్పులుగా కొలిచే మరిన్ని కులాల వారు జాతరకు ముందు పుట్టమన్నుతో ఇంట్లో మల్లన్న గద్దెలు నిర్మించుకొని రోజు సాయంత్రం ఇళ్లలో డోలు మోగిస్తారు. నెలపట్టులు నస్సేడు (ఏడు) వారాలు పండుగను జరుపుకుంటారు. ఇళ్లలో డోలు మోగించి నెల రోజుల పాటు భక్తిపారవశ్యంతో మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ జాతరకు వచ్చి దర్శనం చేసుకుంటారు. పాలు, పెరుగు బయటికి ఇవ్వకుండా నేతిని చేసి స్వామి వారికి దీపంగా సమర్పిస్తారు.

నృత్యమండపంలో సల్లవద్దనం

బండారిని పూసుకున్న భక్తులు కాకతీయుల నృత్య మండపంలో కొరడాల మధ్య శివనాట్యం చేసి మల్లన్నను స్మరిస్తూ సల్ల కవ్వం (మజ్జిగ) చేసి స్వీకరిస్తారు. దీనిని చూడటానికి భక్తులు వేలసంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల నృత్యాలు మండపాన్ని మారుమోగించగా పసుపుమయవుతుంది.

సంక్రాంతికే ప్రభల జాతర

సంక్రాంతి వరకు మొదటి పంట పండి రెండో పంట రైతు ఇంటికి చేరుకుంటాయి. ధాన్యం దిగుబడులు పెరుగాలని పశుసంపద వృద్ధి చెందాలని ప్రభల బండ్లలను (ఎద్దుల బండ్లు) సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం అనవాయితీగా వస్తోంది. మార్నేని వంశీయులు పెద్ద రథంను (శిడి) అందంగా ముస్తాబుచేసి గ్రామంలోని పురవీధుల గుండా మహానివేదనను ఆలయానికి తీసుకవస్తారు. దీనిని అనుసరించి వివిధ గ్రామాల నుంచి వచ్చే బంతిపూల బండ్లు తిరుగుతాయి. సాయంత్రం నుంచి తెల్లవారేవరకు శోభ సంతరించుకుంటుంది. దీనిని బట్టే జానపదుల జాతరగా పిలుబడుతుందని ప్రచారంలో ఉంది.

జాతర, వారాలు

ఐలోని జాతరకు సంబంధించి డిసెంబరు 17న ఆదివారం రోజున స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర మార్గశిర శుద్ధ పంచమిన దృష్టికుంభం ప్రారంభమైంది. ఆపై జాతర మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. ఈ నెల 13న ధ్వజారోహణముతో ఉత్సవాలు ప్రారంభమై 14న భోగి పండుగ 15న మకర సంక్రాంతి ఈ రెండు రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. తర్వాత ఉగాది వరకు ప్రతీ ఆది, బుధ వారం వారంతపు జాతర సాగుతుంది. మొత్తం 11 వారాల జాతరకు లక్షల భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఫ్రీ వీఐపీ పాస్‌ల రద్దు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయ ఆదాయం పెంచేందుకు ఫ్రీ వీఐపీ పాస్‌ల జారీని రద్దు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఇక వీఐపీ పాస్‌లను రూ. 200 ధర పెట్టి కొనుగోలు చేయాల్సిందేనని ఈవో గురువారం విలేకరులతో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వారం కిందట దేవాదాయ, వివిధ శాఖలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఎడాపెడా వీఐపీ పాస్‌లు జారీ చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. దీంతో వీఐపీ పాస్‌లు రద్దు చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో వీఐపీ పాస్‌ను రూ.200కు జారీ చేయాలని ఈవోకు సూచించారు. అంతేకాకుండా వీఐపీ పాస్‌లను రూ.1.50 లక్షలు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కొనుగోలు చేశారు.

ఐనవోలు జాతరలోనూ..

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో ఈ సారి వీఐపీ పాసులు రద్దు అయ్యాయి. వాటి స్థానంలో వీవీఐపీ టికెట్లను జారీ చేస్తున్నారు. ఒక్కో టికెట్ ధర రూ.500కు ఖరారు చేశారు. దీనికోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. యేటా జాతర సందర్భంగా వీఐపీ పాస్‌లు ఇచ్చేవారు. ఒక్కో పాస్‌పై రూ.500 తీసుకొని రశీదు ఇచ్చేవారు. ఒక పాస్‌పై ఐదుగురు దర్శనానికి వెళ్లేవారు. కిందటేడు వీఐపీ పాసులపై రూ.2.50 లక్షల ఆదాయం సమకూరింది. అయితే వీఐపీ పాస్‌లు రాజకీయంగా పక్కదారి పడుతున్నాయని విమర్శలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వీఐపీ పాస్‌లు జారీ చేయవద్దని సూచిస్తు తాను టిక్కెట్ కొనుగోలు చేసి క్యూలైన్లో వస్తానని చెప్పడంతో పాస్‌లను ముద్రించలేదు. యేటా పలువురు తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారు వేలాదిమందిని వీఐపీ క్యూలైన్లో దర్శనాలు చేయించేవారు దీంతో ఈసారి ఆ పద్ధతికి చెక్‌పెట్టడంతో ఆదాయం పెరుగనుంది. ఆలయంలో స్వామి వారి దర్శనాలు, ధర్మదర్శనం(ఉచితం), శీఘ్ర దర్శనం టిక్కెటు ధర (రూ.50), విశిష్ట దర్శనం టిక్కెటు ధర (రూ.100), వీవీఐపీ టిక్కెటు ధర (రూ.500) ఖరారు చేసినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వడ్డెపల్లి, జనవరి 11: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా తనను ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తాను డాక్టర్‌గా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేసిన సేవలను గుర్తించి లోక్‌సభ సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 1996 నుంచి 2001 వరకు చేర్యాల ఎంపీపీగా, జిల్లా డీఆర్‌డీఏ బాడీ సభ్యుడిగా, వరంగల్ గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా కాకుండా.. జిల్లాలోని అనేక నియోజక వర్గాల ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించానని చెప్పారు. 2009 జనరల్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ మహాకూటమి అభ్యర్థిగా, 2014లో వరంగల్ లోక్‌సభకు మహాకూటమి అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న తనకు వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు ఉడమల బాల్‌రెడ్డి, మంచాల చిరంజీవి, గోగికార్ కృష్ణకుమార్, ఉప్పుల రాములు, గౌరవేని శివకుమార్, ముస్త్యాల జార్జి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణను కలిసిన లెనిన్



నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెనిన్

సుబేదారి, జనవరి11: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను హైదరాబాద్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం జర్నలిస్టు నాయకుడు బీఆర్ లెనిన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇండియా కూటమి వరంగల్ పార్లమెంట్‌అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని ఈ సందర్భంగా లెనిన్ విజ్ఞప్తి చేశారు. లెనిన్ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

హనుమకొండ రూరల్: వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని హనుమకొండ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జన్నె మొగిలి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శాలువతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్నె మొగిలి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో సుమారు 26 యేళ్లుగా పనిచేస్తూ, జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలతో సత్సంబంధాలు కలిసి ఉన్నట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా బీజేపీ తరుపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

గోపాల్‌పూర్ చెరువులో గుడిసెల కూల్చివేత

ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతల డిమాండ్



గుడిసెవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వడ్డెపల్లి, జనవరి 11: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌పరిధిలోని గోపాల్‌పూర్ చెరువులో పేదలు వేసుకున్న గుడిసెలను జిల్లా యంత్రాంగం గురువారం తెల్లవారు జామున కూల్చివేసింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసుల ఆధ్వర్యంలో చెరువులోని గుడిసెలను కూల్చివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గోపాల్‌పూర్ చెరువు శిఖం సర్వే నంబర్ 89లో సుమారు 20 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. రెండేళ్ల కిందట సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలు చెరువు శిఖంలోని స్థలాన్ని చదును చేసి అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, నీటి పారుదల శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసులతో ఎక్స్‌కావేటర్‌తో గుడిసెలను నేలమట్టం చేశారు. గుడిసెలను ప్రభుత్వ యంత్రాంగం తొలగించడంతో గుడిసెలు వేసుకున్న పేదలు నిరాశ్రయులయ్యారు. పేదలు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమని సీపీఎం నేతలు తేలూరి ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, కూస రాజేష్‌లు ఆరోపించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచన చేసి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుబేదారి: గోపాలపురం చెరువు శిఖంలో 2 యేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు సంబంధించిన గుడిసెలను కూల్చడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి పెద్ద సంఖ్యలో గుడిసెవాసులతో సీపీఎం నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. అర్ధరాత్రి మునిసిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో గుడిసెలు తొలగించడం సరైంది కాదన్నారు. అనంతరం గుడిసెవాసుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, వెంకట్, తిరుపతి, కిశోర్‌తోపాటు గుడిసెవాసులు పాల్గొన్నారు.

ఈనెల 13న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కైట్ ఫెస్టివల్

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న శనివారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను నిర్వహించనున్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కైట్ ఫెస్టివల్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది. సంక్రాంతి పర్వదినాన గ్రామాల్లో, పట్టణాల్లో పిల్లలు, పెద్దలు రంగు రంగుల పతంగులను ఎగురవేయడం ఆనవాయితీ. ప్రాచీనకాలంగా వస్తున్న సంప్రదాయం. యాంత్రిక జీవనం వల్ల పతంగులను ఎగురవేయడం ఇటీవల కాలంలో చాలా తగ్గింది. పట్టణీకరణ వల్ల మైదాన ప్రాంతాలు కనుమరుగై పతంగులు స్వేచ్ఛగా ఎగురవేసే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నగరవాసులకు పతంగుల ఎగురవేతలో ఉన్న ఆనందాన్ని మరోసారి కలుగచేసేందుకు ఈ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో 2017లో నగరంలో జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది తెలిసిందే. కలెక్టర్ పమేలా సత్పత్తి హయాంలో 2019లో కూడా ఒకసారి రాష్ట్ర స్థాయి పతంగుల పండుగను ఇదే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు.



ఎంజీఎంలో ఆందోళన చేస్తున్న నర్సులు

నర్సులను దూషించిన స్వీపర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంజీఎంలో విధులు బహిష్కరించి నర్సుల ఆందోళన

హనుమకొండ అర్బన్, జనవరి11: సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న నర్సులను అకారణంగా దూషించిన స్వీపర్ రాజమ్మపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సులు ఆందోళన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం విధులు బహిష్కరించి పరిపాలన విభాగం ఎదుట ధర్నా, ఆందోళన చేశారు. రోగులు చికిత్స పొందుతున్న వార్డులో పారిశుధ్య చర్యలు నిర్వహించకపోవడంతో సంబంధిత వార్డు హెడ్ నర్సు పద్మలత విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజమ్మ అనే మహిళా ఉద్యోగి హెడ్‌నర్సుపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడింది. అంతేకాకుండా ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న నర్సులందరినీ ఉద్దేశించడంతో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. నర్సుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన స్వీపర్‌ను విధుల నుంచి తొలగించే వరకు విధులకు హాజరు కాకుండా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని సూపరింటెండెంట్ కోరడంతో నర్సులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రంపహాడ్'కు భారీ బందోబస్తు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



జాతర రోడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్రంలో రెండో అతిపెద్దజాతరైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారాలమ్మలను ఆయన సందర్శించారు. ఆ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వరంగల్, దుర్గంపేట, ఆత్మకూరు నుంచి అలాగే చౌళ్లపల్లి ద్వారా వచ్చే రోడ్డు పెద్దాపురం నుంచి జాతరకు వచ్చే రోడ్లను డీసీపీ పరిశీలించారు. జాతర చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు పంటలు వేయవద్దని పోలీసు అధికారులు స్థానికులకు సూచించారు. గతంలో కంటే ఈసారి భారీగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ బోరిగం స్వామిని పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. జాతర చుట్టూ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు మఫ్టీలో స్పెషల్ పార్టీ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత చేసి క్షణాలలో పోలీసులు చేరకునేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాళోజీ జంక్షన్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యుడు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి రూ.2016, రెండో బహుమతి రూ.1,116, మూడో బహుమతి రూ.516లు ఉంటాయని సొసైటీ వైస్ ఛైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ప్రోత్సాహక బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ గిఫ్ట్‌లు అందజేస్తామని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు సెల్ నంబర్లు 83673 56765 / 83670 56765 లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకుంటే ఇక్కడికి వచ్చాన నమోదు చేసుకోవచ్చన్నారు.



రంగనాథస్వామి ఆలయంలో పూజలు

వరంగల్‌టౌన్, జనవరి 11: కాశిబుగ్గ రంగనాథస్వామి దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని చండీహోమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వంగర రవి, చిలుపురి సురేష్, సుల్తానా సమక్క, మౌటం శ్రీనివాస్, ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంత్రిని కలిసిన కాటన్ అసోసియేషన్ బాధ్యులు



మంత్రితో ప్రతినిధుల బృందం

వరంగల్‌టౌన్, జనవరి 11: హైదరాబాద్‌లో బుధవారం రాత్రి రాష్ట్ర ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ లెజిస్లేటీవ్ ఎఫైర్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలతో ఇంట్రాక్టివ్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం హాజరైంది. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబును శాలువాతో సత్కరించారు. అనంతరం కాటన్ అండ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్ ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కక్కిరాల రమేష్, పి.కృష్ణారెడ్డి, అల్లె సంపత్, రాజేష్ డి.కరాణి పాల్గొన్నారు.

మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌ను కలిసిన రైతు సంఘం



డైరెక్టర్‌కి వినతి పత్రం అందజేస్తున్న సోమిడి శ్రీనివాస్

వరంగల్‌టౌన్, జనవరి 11: రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెటింగ్‌శాఖ అమలు చేస్తున్న రైతు బంధు పథకం ద్వారా మిర్చి, పసుపు రైతులు తీసుకున్న రుణానికి వడ్డీ మాఫీ చేయాలని, రుణ కాలపరిమితిని పొడిగించాలని కోరారు.

నిబంధనల మేరకే అనుమతుల జారీ..



భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

హనుమకొండ సిటీ, జనవరి 11: నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతులు జారీ అవుతాయని, ఉల్లంఘిస్తే కూల్చివేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. గురువారం నగరంలోని మడికొండ, నందిహిల్స్, జూలైవాడ, జక్కలొద్ది తదితర ప్రాంతాల్లోని నిర్మాణ అనుమతుల ప్రాంతాలను పరిశీలించారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

గీసుగొండ, జనవరి 11: చదువులో ఎంతో ప్రతిభ కనబరుస్తున్న గీసుగొండకు చెందిన నిరుపేద విద్యార్థి బండారు రవికుమార్‌కు ఊకల్ సర్పంచ్ మొగసాని నాగదేవతసంపత్ రూ.10వేల ఆర్థికసాయం గురువారం అందించారు. రవికుమార్ టెన్త్‌లో ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించి, బీటెక్ పూర్తిచేసి అమెరికాకు వెళ్తున్నందున తల్లిదండ్రులు లేని అతడికి సాయం అందించారు. కార్యక్రమంలో కౌడగాని చిరంజీవి, కొత్తగట్టు కోటీశ్వర్, బోయ రాజు, మండల నరేష్, బండారు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ఉండాలి

మట్టెవాడ, జనవరి 11: ప్రతీ ఒక్కరు రహదారి భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ట్రాఫిక్ సీఐ వెంకన్న అన్నారు. గురువారం వరంగల్‌లోని తాళ్లపద్మావతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరు విధిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం నేరమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మల్లేశం, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఏకశిల పాఠశాలలో సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు



కృష్ణవేణి ప్రతిభ పాఠశాలలో భోగి మంటలు



శంభునిపేట లిటిల్ లారెన్స్ హై స్కూల్‌లో ముగ్గులపోటీలు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

కరీమాబాద్, జనవరి11: అండర్ రైల్వేగేటు ప్రాంతం ఏకశిలానగర్‌లోని చాణక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో ఉపాధ్యాయులు ప్రవీణ్, రహమత్, సుమన్, కల్పన, శ్వేత, సంధ్య, కోమల, రజిత, ఇర్ఫాన, నేహా పాల్గొన్నారు.

● మామునూరు : మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ ఆధీనంలో నిర్వహించే కృష్ణవేణి ప్రతిభ పాఠశాలలో బుధవారం సంక్రాతి సంబురాలు ఘనంగా జరిగాయి. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సీనియర్ సిటీజన్ ఇనుగాల జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: నగరంలోని రంగశాయిపేటలోని అరవింద పబ్లిక్ స్కూల్ సంక్రాంతి వేడకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పంచకం నర్సయ్య పాల్గొన్నారు. అరవింద జీనియస్ హై పబ్లిక్ స్కూల్‌లో సంబురాలు చేసుకున్నారు. ముగ్గుల పోటీలు, కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమాదేవి, అరుణ, అశ్విని ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. శంభునిపేటలోని లిటిల్ లారెన్స్ హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం కైట్స్ ఫెస్టివల్‌లో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సింగారపు రాజు, అనిత, హబీబా, స్వప్న, రమ్యకృష్ణ, రెహానా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగెం, జనవరి 11: గవిచర్ల మోడల్ స్కూలులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్కూలు ప్రిన్సిపాల్ ముజఫర్ రహెమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో వంద సీట్లతోపాటు ఏడో తరగతి నుంచి పదవ తరగతి వరకు స్కూలులో ఏర్పడబోయో ఖాళీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందన్నారు.

సంతోషిమాత కాలనీలో చోరీ

మట్టెవాడ, జనవరి 11: వరంగల్ హంటర్‌రోడ్డులోని సంతోషిమాత కాలనీలో తాళం వేసిన ఇంట్లో గురువారం దొంగతనం జరిగింది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం. సంతోషిమాత కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు తాళాన్ని పగులగొట్ట ఇంట్లో చొరబడి బీరువా తాళాన్ని పగులగొట్టి బట్టలను చిందరవందరంగా పడేశారు. ఇంటి యజమాని రాజేంద్రప్రసాద్‌తోపాటు కుటుంబ సభ్యులు అమెరికాలో ఉండటంతో గురువారం సాయంత్రం వరకు ఎవరు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీ హాల్‌ను ఐకేపీకి కేటాయించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, మహిళలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 11: సంగెం మండలం మొండ్రాయి గ్రామంలో 25 ఏళ్ల క్రితం ప్రస్తుత మంత్రి, అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసి పూర్తి చేయించారని దానిని ఐకేపీ గ్రామైక్య సంఘాలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేష్ మాదిగ కోరారు. గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు గ్రామైక్య సంఘాలు, 98 స్వయం సహాయక సంఘాలు, 1376 మంది మహిళలు ఉన్నారని, ఈ భవనం ఒక ప్రైవేటు వ్యక్తి తన సొంత భవనంగా ఉపయోగించుకుంటున్నాడని గ్రామ పంచాయతీకి ఎలాంటి రుసుం చెల్లించకుండా ఉన్నాడని కలెక్టర్ ఆ భవనాన్ని మహిళా సంఘాలకు కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కట్టా రాజశేఖర్ మాదిగ, మంద రాజు మాదిగ, కల్లపెల్లి ప్రణయ్‌దీప్ మాదిగలుఉన్నారు.

ఎల్గూరు స్టేషన్ కన్సల్టేటివ్ మెంబరుగా కుమారస్వామియాదవ్



సంగెం, జనవరి 11: ఎల్గూరు స్టేషన్ కన్సల్టేటివ్ మెంబరుగా సంగెం మండలం గవిచర్లకు చెందిన మండల బీజేపీ అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి యాదవ్ నియమితులైనట్టు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తన నియామకానికి సహకారం అందించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎంఏ కార్యవర్గానికి సన్మానం



కమిటీని సన్మానిస్తున్న నిర్వాహకులు

కరీమాబాద్, జనవరి11: ఇటీవల నేషనల్ మెడికల్ అసోసియేషన్ (ఎన్ఎంఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ గుండా రవీందర్, కార్యదర్శి డాక్టర్ మైదం రాజు, కోశాధికారి డాక్టర్ పిట్ట సత్యంలను కూరపాటి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కూరపాటి రమేష్ ఘనంగా సన్మానించారు. గురువారం ఫోర్ట్‌రోడ్ లోని రూపిని హాస్పిటల్‌లో ముగ్గురిని కలిసి సన్మానించారు.



రాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ అధ్యక్షుడిగా రాజు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 11: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ అధ్యక్షుడిగా అప్పరాజు రాజును నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ నియామక ఉత్తర్వులను రాజుకు అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాళ్ల రవి, వద్దకొండ వేణుగోపాల్, దాడి మల్లయ్య పాల్గొన్నారు.

ముగ్గులు, క్రీడల పోటీలు



ఓసిటీ ఇండోర్ స్టేడియంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 11: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఓసిటీ స్టేడియంలో ముగ్గులు, జూడో, క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి టీవీఎల్ సత్యవాణి తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం విజేతలకు బహుమతులను అందిస్తామని తెలిపారు.

ఘనంగా గోల్డెన్ ఓక్ స్కూల్ రెండో వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గంటా రవికుమార్

సుబేదారి, జనవరి 11: గ్రేటర్ మహానగర పాలక సంస్థ 11వ డివిజన్‌లోని గోల్డెన్ ఓక్ స్కూల్ హనుమకొండ బ్రాంచ్‌లో స్కూల్ రెండో వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హాజరయ్యారు. స్కూల్ చైర్మన్ గంటా రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డాన్స్‌లు, మార్షల్ ఆర్ట్స్ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో గోల్డెన్ ఓక్ ప్రిన్సిపాల్స్ దయాసాగర్, దీప్తి, విజయలక్ష్మీ, సృజన, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

10 లీటర్ల గుడుంబా స్వాధీనం

వర్ధన్నపేట, జనవరి 11 : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట పరిధిలోని నీలగిరి స్వామి తండా, డీసీ తండా, గుబ్బెటి తండాలలో గుడుంబా తయారీ, అమ్మకం దారులపై దాడులు గురువారం నిర్వహించారు. సుమారు 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తయారీదారులు అయిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

చెకుముఖి పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చెకుముఖి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ

గీసుగొండ, జనవరి 11: విద్యార్థుల్లో హేతువాద దృక్పథాన్ని పెంపొందించేందుకు చెకుముఖి సంబరాల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెకుముఖి మండల కన్వీనర్ అశోక్ తెలిపారు. గురువారం చెకుముఖి సంబరాల వాల్‌పోస్టర్‌ను సీఐ రామకృష్ణ గీసుగొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ 19న స్కూల్‌స్థాయిలో, 27న మండలస్థాయి, ఫిబ్రవరి 3న జిల్లాస్థాయి, 9 నుంచి 11వరకు రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులకు టీషర్టులను అందిస్తున్న నిర్వాహకులు

గీసుగొండ, జనవరి 11: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా మొగిలిచర్లలో అల్లం బాలకిశోర్‌రెడ్డి(ఏబీకేఆర్) యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను గీసుగొండ వైస్ ఎంపీపీ రడం/శ్రావ్యభరత్ గురువారం ప్రారంభించారు. వారం రోజుల పాటే జరిగే ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 35 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ వైస్‌చైర్మన్ గజ్జి విష్ణు, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బరుపటి రాజేష్, నేతాజీ సర్వీస్ టీం కార్యదర్శి బరుపటి అనిల్, సాయి,హరీష్, నరేందర్, వెంకటేష్, రాజేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



నజీర్‌ను సత్కరిస్తున్న టీమ్ సభ్యులు

శంభునిపేట, జనవరి 11 : యువకులు క్రీడల్లో రాణించాలని సామాజిక కార్యకర్త నజీర్ అన్నారు. కాకతీయ ప్రీమియర్ లీగ్‌లో రాణించాలని శంభునిపేటకు చెందిన హెచ్ఎమ్ఆర్ టీమ్‌కు నజీర్ క్రీడా దుస్తులు, కిట్‌లను అందించాడు. క్రీడాకారులకు సరైన వసతులు కల్పించి ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను తయారు చేయవచ్చన్నారు.

నేరాల అదుపులో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీ టీమ్స్ ఎస్సై కంచి విద్యాసాగర్

మట్టెవాడ, జనవరి 11: నేర చరిత్రకు దూరంగా ఉంటూ, నేరాల అదుపులో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్స్ ఎస్సై కంచి విద్యాసాగర్ సూచించారు. గురువారం రామన్నపేట బట్టల బజార్‌లోని పడిశాల వీరభద్రయ్య ఆంధ్రబాలిక హైస్కూల్‌లో విద్యార్థులకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వ్యక్తిగత వివరాలను షేర్ చేయడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్ చేసినా వాట్సాప్ నంబర్ల 87126 85257, 87126 85142, 87126 85270 లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణిప్రియదర్శిని, శారద, సునీత, దీపిక, మధులత, హెడ్‌కానిస్టేబుళ్లు బిక్షానాయక్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగి మట్టిదందా

• ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఏళ్ల నుంచి తిష్ట • యథేచ్ఛగా అక్రమ వ్యాపారం
• కోట్లకు పడగలెత్తిన సదరు ఉద్యోగి • అధికారుల అండతో అక్రమాలు • పట్టించుకోని ఉన్నతాధికారులు



నర్సంపేట టౌన్, జనవరి 11 : ఆయన పేరుకే రెవెన్యూ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి.. చేసేది మాత్రం ఖల్‌నాయక్ పనులు. దేవుడి పేరు ఉన్న సదరు ఉద్యోగి పనులు మాత్రం చీదరించుకునేలా ఉంటాయి. దశాబ్ద కాలం క్రితం సాధారణ ఉద్యోగిగా రెవెన్యూ శాఖలో ఔట్‌సోర్సింగ్‌పై విధుల్లో చేరి, అధికారులను మచ్చిక చేసుకుని ఏళ్ల తరబడి అక్కడే తిష్టవేశాడు.

నర్సంపేట నియోజకవర్గంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుండడంతో విచ్చలవిడిగా వెంచర్లు వెలుస్తున్నాయి. వెంచర్లలో రహదారులు, ఇండ్ల నిర్మాణానికి స్థిరాస్తి వ్యాపారులకు మట్టి, మొరం అవసరం ఉండడంతో వాటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్‌ను తెలుసుకున్న ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మట్టి దందాకు తెరలేపాడు. కొన్నేళ్ల క్రితం మొదట జేసీబీలను, ట్రాక్టర్‌లను కిరాయికి తీసుకుని దందా కొనసాగించిన సదరు ఉద్యోగి నేడు రెండు, మూడు జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు సొంతంగా కొనుగోలు చేసి డివిజన్‌లోని నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లోని ప్రభుత్వ భూములు, ఫారెస్టు గుట్టలను తోడేస్తూ మట్టి, మొరం దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూ లక్షల రూపాయలను అక్రమంగా సంపాదిస్తున్నాడు.

పేరుకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం..

పొరుగు జిల్లాకు చెందిన సదరు ఉద్యోగి పేరుకు మాత్రం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఉదయం వివిధ మండలాల్లో భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నియోజకవర్గ కేంద్రమైన డివిజనల్ కార్యాలయానికి వచ్చే ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని తాను పరిష్కరిస్తానని చెప్పి పైరవీలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. ఈ విషయంలో మండలాల్లోని అధికారులపై సైతం తనకున్న పలుకుబడితో పెత్తనం చెలాయిస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా పగలైతే ఇక రాత్రిళ్ల చీకటి దందాతో పెట్రేగిపోతున్నాడు. డివిజన్‌లోని నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లోని కన్నారావుపేట, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో ఫారెస్టు గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టిదందాను సదరు ఉద్యోగి యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. మట్టిదందాతో నేడు ఆ ఉద్యోగి కోట్ల రూపాయలకు పడగలెత్తాడు. ఎవరైనా దందాకు అడ్డొస్తే వారికి ముడుపులివ్వడం, లేదంటే తానే పోలీసులచే బెదిరింపులకు పాల్పడుతుంటాడు.

రెవెన్యూలో ఏళ్ల తరబడి ఒక్కచోటే ఉద్యోగం

రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి ఒక్కచోటే ఉద్యోగం చేయడం, బదిలీలు లేకపోవడంతో తాను ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా మారింది. కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తుండడంతో జిల్లా స్థాయి అధికారులతో సంబంధాలు పెంచుకొని తన చీకటి దందాను అడ్డుఅదుపు లేకుండా కొనసాగిస్తున్నాడు. మట్టి, మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ శాఖలో తాను పనిచేస్తూ కంచే చేను మేసిందన్నట్లుగా ఆ శాఖ ఉద్యోగే పెద్ద ఎత్తున మట్టి, మొరం దందాను కొనసాగించడంపై ఆ శాఖకు తీరని మచ్చగా మారింది.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 12 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

సామాజిక ఉద్యమంలా రోడ్డు భద్రత వారోత్సవాలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 11 : రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ విధానంలా కాకుండా సామాజిక ఉద్యమంలా రోడ్డు భద్రతా వారోత్సవాలు ఉండాలని వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ఇల్లంద గ్రామంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై యువతకు యూత్ వీక్ చేపట్టి ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించడం సంతోషంగా ఉందన్నారు. భద్రతా నియమాలను పాటించడంతో పాటు ప్రతీ ఒక్కరు వాహన పేపర్లు, లైసెన్సు కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మద్ది రాజ్ కుమార్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తాండ్ర రాజేందర్, టీంలీడర్ జోగుల సంపత్, వలంటర్స్ పొన్నాల నాగరాజు, మైదం రంజిత్, మల్లెపాక రాకేష్, హరీష్, శ్రావణ్, అశోక్, కృష్ణంరాజు, మహేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

వర్ధన్నపేట, జనవరి 11 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వర్ధన్నపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో స్వామి వివేకా నంద 161వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహా నికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్ మాట్లాడుతూ ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగినటువంటి యువతకు వివేకానందుడు ఎంతో ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ వివేకానంద స్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అజయ్, శశాంక్, రాజు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ఎదగాల ని ఆదర్శ యూత్ ప్రతినిధి సట్టు గిరిబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకా నంద జయంతి ఉత్సవాలను నిర్వహించి, విద్యార్థులకు వ్యాస రచన , వ్యకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో జ్యోతి, మహమ్మద్ జహంగీర్, రవి, ఇలారపు సతీష్, మంచ నరేష్, మంచ విజయ్ పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఉప్పరపెల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా యువజన దినోత్సవం నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే యువజన దినోత్సవాన్ని ముందస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, లింగమూర్తి, విజయ, రాజు, అరుణదేవి, పీఈటీ వీరస్వామి పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఖానాపురం, జనవరి 11 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ రమేష్ అన్నారు. జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మండల కేంద్రం శివారులోని టేకుల తండాలో సామాజిక రుగ్మతలపై ఆట పాటల ద్వార ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, బాల కార్మికుల నిర్మూలన, మూఢ నమ్మకాలపై, డయల్ 100, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, సీసీ కెమెరాలు, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వల్ల యువకులు వారి జీవితాలను నాశం చేసుకోవద్దని ప్రదర్శన, మేజిక్ షోలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడిద కుమార్, ఎంపీటీసీలు బోడ భారతి, మర్రి కవిత, కళా బృందం ఇంచార్జీ అధికారి నాగమణి, విలియమ్, రత్నయ్య, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆడిట్‌తోనే సంస్థలు మరింత పటిష్టం

వర్ధన్నపేట, జనవరి 11 : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గ్రామైక్య సంఘాల రికార్డులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి తప్పులకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ ఏపీఎం వేణు, సీటీఓ ఆడిటర్ సంపత్ తెలిపారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో గ్రామైక్య సంఘాల రికార్డులను అంతర్గత ఆడిట్ నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించే అంతర్గత ఆడిట్‌లో ఇల్లంద, ల్యాబర్తి క్లస్టర్ల ఆడిట్ పూర్తి చేసినట్లు తెలిపారు. నెలవారి సమావేశాల్లో లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, స్వామి, రవీంద్ర, పద్మావతి, రదమ, నజిమా, రజిత, రోజా, మమత, లక్ష్మి, అనిత తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

వర్ధన్నపేట, జనవరి 11 : తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండగ ప్రతీక అని శ్రీఅరబిందో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సంపత్‌రావు, డీన్ వీరన్న తెలిపారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీఅరబిందో హైస్కూల్‌లో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో చక్కగా ముస్తాబై పాఠశాలకు విచ్చేశారు. పాఠశాల ప్రాంగణంలో రంగు రంగుల ముగ్గులు వేసి, ఆటపాటలతో అరలించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగి మట్టిదందా

• ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఏళ్ల నుంచి తిష్ట
• యథేచ్ఛగా అక్రమ వ్యాపారం
• కోట్లకు పడగలెత్తిన సదరు ఉద్యోగి
• అధికారుల అండతో అక్రమాలు
• పట్టించుకోని ఉన్నతాధికారులు

నర్సంపేట టౌన్, జనవరి 11 : ఆయన పేరుకే రెవెన్యూ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి... చేసేది మాత్రం ఖల్‌నాయక్ పనులు. దేవుడి పేరు ఉన్న సదరు ఉద్యోగి పనులు మాత్రం చీదరించుకునేలా అక్రమంగా ఉంటాయి. దశాబ్ద కాలం క్రితం సాధారణ ఉద్యోగిగా రెవెన్యూ శాఖలో ఔట్‌సోర్సింగ్‌పై విధుల్లో చేరి, అధికారులను మచ్చిక చేసుకుని ఏళ్ల తరబడి అక్కడే తిష్టవేశాడు.

నర్సంపేట నియోజకవర్గంలో స్థిరాస్థి వ్యాపారం జోరుగా సాగుతుండడంతో విచ్చలవిడిగా వెంచర్లు వెలుస్తున్నాయి. వెంచర్లలో రహదారులు, ఇండ్ల నిర్మాణానికి స్థిరాస్థి వ్యాపారులకు మట్టి, మొరం అవసరం ఉండడంతో వాటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్‌ను తెలుసుకున్న ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మట్టి దందాకు తెరలేపాడు. కొన్నేళ్ల క్రితం మొదట జేసీబీలను, ట్రాక్టర్లను కిరాయికి తీసుకుని దందా కొనసాగించిన సదరు ఉద్యోగి నేడు రెండు, మూడు జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు సొంతంగా కొనుగోలు చేసి డివిజన్‌లోని నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లోని ప్రభుత్వ భూములు, ఫారెస్టు గుట్టలను తోడేస్తూ మట్టి, మొరం దందాను యధేచ్ఛగా కొనసాగిస్తూ లక్షలాది రూపాయలను అక్రమంగా సంపాదిస్తున్నాడు.



• పేరుకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం..

పొరుగు జిల్లాకు చెందిన సదరు ఉద్యోగి పేరుకు మాత్రం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఉదయం వివిధ మండలాల్లో భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నియోజకవర్గ కేంద్రమైన డివిజనల్ కార్యాలయానికి వచ్చే ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని తాను పరిష్కరిస్తాననిచెప్పి పైరవీలుచేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. ఈ విషయంలో మండలాల్లోని అధికారులపై సైతం తనకున్న పలుకుబడితో పెత్తనం చెలాయిస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా పగలైతే ఇక రాత్రిళ్లు చీకటి దందాతో పెట్రేగిపోతున్నాడు. డివిజన్‌లోని నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లోని కన్నారావుపేట, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో ఫారెస్టు గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టిదందాను సదరు ఉద్యోగి యధేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. మట్టిదందాతో నేడు ఆ ఉద్యోగి కోట్ల రూపాయలకు పడగలెత్తాడు. ఎవరైనా దందాకు అడ్డొస్తే వారికి ముడుపులివ్వడం, లేదంటే తానే పోలీసులచే బెదిరింపులకు పాల్పడుతుంటాడు.

• రెవెన్యూలో ఏళ్ల తరబడి ఒక్కచోటే ఉద్యోగం

రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి ఒక్కచోటే ఉద్యోగం చేయడం, బదిలీలు లేకపోవడంతో తాను ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా మారింది. కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తుండడంతో జిల్లా స్థాయి అధికారులతో సంబంధాలు పెంచుకొని తన చీకటి దందాను అడ్డుఅదుపు లేకుండా కొనసాగిస్తున్నాడు. మట్టి, మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ శాఖలో తాను పనిచేస్తూ కంచే చేను మేసిందన్నట్లుగా ఆ శాఖ ఉద్యోగే పెద్ద ఎత్తున మట్టి, మొరం దందాను కొనసాగించడంపై ఆ శాఖకు తీరని మచ్చగా మారింది.

విద్యార్థిలో మార్పు తీసుకురావడానికే వైస్ ప్రిన్సిపాల్ మందలించారు

• విచారణ అధికారులకు ఎల్‌హెచ్‌పిఎస్ నాయకుల వినతి

నర్సంపేట, జనవరి 11 : విద్యార్థిలో మార్పును తీసుకురావడానికే పట్టణంలోని గిరిజన గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మందలించారే తప్ప అతనికి మరే దురుద్దేశం లేదని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ అన్నారు. కొంతమంది మంగళవారం కళాశాలను సందర్శించడానికి వచ్చి, సదరు విద్యార్థి తల్లిదండ్రులను కళాశాల ఆవరణలో కూర్చోబెట్టి దర్నా నిర్వహించారని ఆరోపించారు. గురువారం గిరిజన కళాశాలను సందర్శించడానికి వచ్చిన విజిలెన్స్ అధికారులు, ఆర్‌సిఓడిఎస్ వెంకన్నకు వివరించి వినతిపత్రం అందజేసినట్లు వాసునాయక్ తెలిపారు.

విద్యార్థిని చితకబాదారని వచ్చిన ఆరోణ విషయంపై విద్యార్థి తరుపు బంధువులు, తల్లిదండ్రులతో లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు వాసవ్త, అవాస్తవాలను తెలుసుకునేందుకు గురుకుల కళాశాలకు వచ్చామని అధికారులకు వివరించామన్నారు. విద్యార్థికి కొంత మంది సహకరించడం వల్ల ఈ ప్రస్తావన వచ్చిందని సదరు అధికారులకు తెలిపామన్నారు. విద్యార్థిని సన్మార్గంలో పెట్టడానికి అతనిలో మార్పుతీసుకు రావడం కోసం వైస్ ప్రిన్సిపాల్ మందలించినట్లు తెలిసిందే తప్ప మరే దురుద్దేశంలేనట్లు కనబడిందని విచారణ అధికారులకు వివరించామని ఆయన అన్నారు. విద్యార్థులు గురుతర భక్తి, ప్రేమతో, గౌరవంగా మెలగాలని ఎల్‌హెచ్‌పిఎస్ తరపున అనుబంధ విద్యార్థి సంఘాల తరుపున అందరిని కోరుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు భూక్య జగన్‌నాయక్, సేవాలాల్ సేన విద్యార్థి విభాగం నర్సంపేట ఇన్‌చార్జి సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.



విజిలెన్స్ విచారణ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ



పాఠశాలలో వంటను పరిశీలిస్తున్న డీటీడీవో సౌజన్య

నల్లబెల్లి, జనవరి 11 : మండలంలో మూడు చెక్కలపల్లి గ్రామ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం డీటీడీవో సౌజన్య తనిఖీచేశారు. డీటీడీవో ఆశ్రమ పాఠశాలలో వంటను పరిశీలించి, విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని వార్డెన్‌కు సూచించారు. అలాగే క్లాస్ రూంలో విద్యార్థులతో మాట్లాడుతూ పాఠాలను ఉపాధ్యాయులు సమయం ప్రకారం సమర్థవంతంగా బోధిస్తున్నారా?లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంచి భోజనంతో పాటు సమర్థవంతమైన విద్యాను అం దించాలని సిబ్బందికి, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు సాంబయ్య, వార్డెన్ శాంత పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చెన్నారావుపేట, జనవరి 11 : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలను అందించిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాలలో పని చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, జడ్పీఎస్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న రవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి సరళ మాట్లాడుతూ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, హెచ్ఎం పాపమ్మ, బానోతు వెంకన్న, అజ్మీరస్వామి, విష్ణువర్ధన్, అశోక్, నాగేశ్వర స్వామి, వీరభద్రయ్య, క్రాంతి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

నల్లబెల్లి, జనవరి 11 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై కళాజాత బృందం సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం కళాజాత బృందం తమ ప్రదర్శనతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి ప్రధానంగా రక్షణలేని సెక్స్, కలుశుతమైన రక్త మార్పిడి, కలుశితమైన సిరంజీలు, గర్భవతి అయిన తల్లికి హెచ్ఐవి ఉంటే పుట్టబోయే బిడ్డకు కూడా వస్తుందని ఇలాంటి నాలుగు రకాల కారణాల వల్ల ఎయిడ్స్ వ్యాధి వస్తుందని అవగాహన కల్పించారు. అంతేకాక ఎయిడ్స్ వ్యాధి వచ్చిన వారు ఎవరైన ఉంటే అధైర్య పడొద్దని, డాక్టర్ల సలహా మేరకు మందులు వాడాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో స్వప్న, మాధురి, జ్యోతి, సామల వీరన్న, లింగన్న, కవిత, పోలేపాక సందీప్, కరుణాకర్, శంకర్, రజిని, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటలు పరిశీలన చేసిన శాస్త్రవేత్తలు



తిమ్మంపేటలో మిరప పంటలను పరిశీలన చేస్తున్న శాస్త్రవేత్తలు

దుగ్గొండి, జనవరి 11 : మండలంలోని తిమ్మంపేటలో సాగు చేసిన తేజ, చెపాట, మిరప పంటలను గురువారం అధికారులు, శాస్త్రవేత్తలు సందర్శించి పరిశీలన చేశారు. క్షేత్రస్థాయిలో పంటల తెగుళ్లకు కారణాలు, రైతులు పాటించే పద్ధతులు తెలుసుకొని రైతులకు తగు సూచనలు చేశారు. సందర్శించిన వారిలో జేడీఏ సుజాత, సీనియర్ ప్రొఫెసర్ రెహమాన్, హర్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నత కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషోదయాల్, జిల్లా ఉద్యాయనశాఖ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్‌రావు, ఏడీ సారంగం, ఉద్యాయన శాఖ అధికారులు శంకర్. జ్యోతి, సుశ్మిత, ఏవో దయాకర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

• నెక్కొండ : మిర్చి పంటలో సోకుతున్న తెగుళ్లపై నివారణకు గాను రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు మండలంలోని అలంకానిపేట గ్రామంలో గురువారం వ్యవసాయ శాస్త్ర వేత్తలు, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సందర్శించారు. మిర్చి పంటలపైన ఆశిస్తున్నటువంటి పురుగులు, తెగుళ్ల నివారణకు పిచికారి చేయవలసిన మందుల వివరాలను రైతులకు తెలిపారు. ఈ సంబంధిత పూర్తి వివరాలను వ్యవసాయ శాఖాధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడీఏ సుజాత, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌జే రెహమన్, హర్టికల్చర్ డిప్యూటి డైరెక్టర్ సీ.ఎస్. వి. మధుసూదన్, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, జెడీఏ ఉషాదయాల్, ఉద్యానశాఖాధికారి ఆర్.శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, ఏవో నాగరాజు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి

నెక్కొండ, జనవరి 11 : డప్పులు కొట్టుకుంటూ, చెప్పులు కుట్టుకుంటూ ఆర్థికంగా వెనుకబడి దుర్భర జీవనం గడుపుతున్న దళితులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరీ చేసి ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర నాయకులు ఈదునూరి యాకయ్య కోరారు. నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ఆయన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ దళితకులాల చేతివృత్తుల హక్కుల సాధనకు గాను ఫిబ్రవరి 29న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు ఒద్దూరి సారయ్య, ఈదునూరి ఉప్పలయ్య, కొమ్ము ఎల్లయ్య, కొంగర శ్రీను, ఈదునూరి సాయిలు, స్వామి, వెంకటేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి విద్య ఎంతో ముఖ్యం

నెక్కొండ, జనవరి 11 : విద్యార్థులకు పదో తరగతి విద్య ఎంతో ముఖ్యమని, పదో తరగతి పరీక్షలు సమీపిస్తుడంతో పరీక్షలకు విద్యార్థులు ముందుగానే సిద్ధంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల సూచించారు. మండలంలోని రెడ్లవాడ హై స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు గురువారం రోటరీ క్లబ్ వరంగల్ వారు అందించిన పదో తరగతి ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలంటే చాలామంది విద్యార్థులు భయాందోళనకు గురవుతుంటారని, విద్యార్థులు ఎలాంటి భయాలను పెట్టుకోకుండ ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. పరీక్షలకు ఎలా చదువాలనే విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేశ్, ప్రధాన కార్యదర్శి బండి మొహన్‌రెడ్డి, కోశాధికారి అనబోతుల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం, జనవరి 11 :మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం దామెర రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 12 నుంచి 22వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి




సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖానాపురం, జనవరి 11 : తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని అశోక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. గురువారం అశోక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు. పతంగుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సరస్వతి, జానకి, కళ్యాణి, సునితదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

పర్వతగిరి, జనవరి 11: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. మండల కేంద్రంలోని విజ్‌డమ్ పాఠశాల, కల్లెడలో ఆర్డీఎఫ్ వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ దేవేందర్, జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు సృజనాత్మకత, ప్రతిభను పెంచడానికి గాను రంగవల్లుల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, శ్రీలత, మూర్తి, నాగరాజు, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, విజేందర్ పాల్గొన్నారు.

మండల పెయింటర్స్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



అనిల్ రాజు

నెక్కొండ, జనవరి 11 : నెక్కొండ మండల రెయిన్ బో పెయింటర్స్ అధ్యక్షుడిగా ఈదునూరి అనిల్, ప్రధాన కార్యదర్శిగా మైదం రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల ఇన్‌చార్జి కందిక చెన్నకేశవులు గురువారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా మాతంగి కల్యాన్, మందా అజయ్, తాటికాయల యాకయ్య, కొంగర రవి, సహాయ కార్యదర్శులుగా సింగారపు అశోక్, వేల్పుగొండ ఎల్లయ్య, ఒగ్గు వెంకటేశ్, దంతాల శ్యాం, కోశాధికారిగా సంపత్, గౌరవ అధ్యక్షులుగా లైసెట్టి వినయ్, ఈదునూరి దీలిప్, గడ్డం యాదగిరి, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

డ్రైవర్స్, క్లీనర్స్ రాస్తారోకో



చెన్నారావుపేటలో ఆందోళన చేస్తున్న డ్రైవర్స్, క్లీనర్స్

చెన్నారావుపేట, జనవరి 11 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన హిట్ అండ్ రన్ చట్టం అమలను వ్యతిరేకిస్తూ వరంగల్ జిల్లా యూనియన్ పిలుపు మేరకు మండల కేంద్రంలో గురువారం నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారిపై సిద్దార్థ గురుకుల పాఠశాలల బస్సులను నడుపుతున్న డ్రైవర్స్, క్లీనర్స్‌లు దర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పాశం మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో నెంబర్ 304ఏను వెంటనే రద్దు చేయాలన్నారు. బస్సులు నడిపేటప్పుడు యాక్సిడెంట్‌లు జరిగితే డ్రైవర్స్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ 7లక్షల జరిమానాను విధిస్తూ ప్రభుత్వం నిర్ణయించడాన్ని విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు లక్క రాజు, ప్రధాన కార్యదర్శి కనుగుల వేణు, టేకుల స్వామి, రమేష్, ప్రశాంత్, అనిల్, స్వామి, వీరేందర్, మల్లయ్య బాదావత్ రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల గుడుంబా స్వాధీనం

• అదుపులో ఇద్దరు

వర్ధన్నపేట, జనవరి 11 : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట పరిధిలోని నీలగిరి స్వామి తండా, డీసీ తండా, గుబ్బెటి తండాలలో గుడుంబా తయారీ, అమ్మకందారులపై దాడులు గురువారం నిర్వహించారు. సుమారు 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తయారీదారులు అయిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ రూరల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌చందర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట ఇన్‌స్పెక్టర్ ఎం.స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చెన్నారావుపేట, జనవరి 11 : మండలంలోని కాల్‌నాయక్ తండాలో శశి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి సమస్యలు ఉన్న రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిందూరరెడ్డి, సర్పంచ్ బాదావత్ రజిత, వీరన్న, కార్యదర్శి వికాస్, కారోబార్ తిరుపతి, సిబ్బంది వీరు. తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

వర్ధన్నపేట, జనవరి 11 : వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు వర్ధన్నపేట పోలీసులు గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జనరల్ స్టోర్స్, కిరాణ, పాన్ షాపులలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, దీని నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైన మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, విజయ్ కుమార్, మహేందర్, ఏఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు శరత్



శరత్

దుగ్గొండి, జనవరి 11 : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన జూలూరి శరత్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడలలో పాల్గొంటున్నాడని మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల ఎల్లయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా శరత్‌ను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్.రాంరెడ్డి, జిల్లా సెక్రెటరీ కక్కెర్ల మల్లికార్జున్, యాదగిరి రమేష్‌లు అభినందించారు.

జీవో 55ను రద్దు చేయాలి

వర్ధన్నపేట, జనవరి 11: జీవో నెంబరు 55ను రద్దుచేసి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 100 ఎకరాల భూమిని కాపాడాలని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సర్వేనెంబర్ 41, 42, 43, 44లలో 100 ఎకరాల భూములను హై కోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ తీసుకొచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి వన్నె తెచ్చిన యూనివర్సిటీ స్థలాన్ని కాపాడుకోవాలన్నారు.

ఒకరి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

నెక్కొండ, జనవరి 11 : నెక్కొండ మండలం పిట్టకాలుబోడుకు చెందిన రైతు దారావత్ రమేశ్ (45) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై షేక్ జాన్ పాషా గురువారం తెలిపారు. రమేశ్ గత కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తితో ఈ నెల 10వ తేదిన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, అతని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ఈ నెల 11తేదిన మృతి చెందాడు. మృతు డి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు నిశా, అరవింద్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దుగ్గొండి, జనవరి 11: మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుచున్న గురుకుల పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు సర్పంచ్ ఓడెటి తిరుపతిరెడ్డి గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పోటీ పరీక్షలు రాసి గురుకులాల నందు సీట్లు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, పాలకుర్తి మల్లయ్య ఉపాధ్యాయులు ఈదుల వీరస్వామి, పద్మశ్రీ, నీరజ, విష్ణువర్ధన్‌లు పాల్గొన్నారు.